సాక్షి నల్లగొండ

ఆదివారం । 22 । అక్టోబర్ । 2023



మూడు నియోజకవర్గాల్లో..
మాడ్గులపల్లి మండలం మూడు నియోజకవర్గాల పరిధిలో ఉండి ఎన్నికల వేళ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. - IIలో



ఫిర్యాదులపై స్పందించాలి
ఎన్నికల ఫిర్యాదులపై సత్వరమే స్పందించాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్ సూచించారు. - IIలో



గంజాయి విక్రేతల అరెస్ట్
నలుగురు గంజాయి విక్రేతలను అరెస్ట్ చేసినట్లు యాదాద్రి ఎక్సైజ్ సూపరింటెండెంట్ నవీన్‌కుమార్ తెలిపారు. - IIలో

న్యూస్‌రీల్

బయోమెట్రిక్ విధానాన్ని ఎత్తివేయాలి

కేతేపల్లి: వరి, పత్తి పంటలను విక్రయించే సమయంలో రైతులు బయోమెట్రిక్ వేసే విధానాన్ని ఎత్తి వేయాలని కాంగ్రెస్ కిసాన్ సెల్ రాష్ట్ర కోఆర్డినేటర్ అలుగుబెల్లి మహేందర్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం ఆయన కేతేపల్లిలో విలేకరులతో మాట్లాడారు. గ్రామాల్లో భూమి లేని వేలాది మంది కౌలు రైతులు భూములు కౌలుకు తీసుకుని పంటలు సాగు చేసుకుంటున్నారని తెలిపారు. పంట దిగుబడులు అమ్ముకునే సమయంలో భూమి పట్టా ఉన్న రైతు బయోమెట్రిక్ వేయాలనే నిబంధనను అమలు చేయటంతో కౌలు రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కౌలు రైతుల పరిస్థితిని అర్థం చేసుకొని ఇప్పటికైనా ప్రభుత్వం బయోమెట్రిక్‌ను తొలగిస్తే కౌలు రైతులకు మేలు జరుగుతుందని పేర్కొన్నారు.

అర్హులందరికీ రుణమాఫీ

- రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షుడు చింతరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాస్‌రెడ్డి

నల్లగొండ టౌన్: రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన రైతులందరికీ రుణమాఫీ జమచేస్తుందని రైతు బంధు సమితి జిల్లా అధ్యక్షుడు చింతరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శనివారం ఆయన నల్లగొండలోని రైతుబంధు సమితి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. టెక్నికల్ సమస్యలు లేని రైతులకు రూ.లక్షలోపు రుణమాఫీ జరిగిందన్నారు. కొందరి అకౌంట్‌లు క్లోజింగ్‌లో ఉండడం వల్ల డబ్బులు తిరిగి వాపస్ వెళ్లాయన్నారు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, రుణమాఫీ కాని రైతుల అర్జీలను ప్రభుత్వం పరిశీలించి ఎన్నికలలోపు డబ్బులు జమచేస్తుందన్నారు. ఇందుకు దరఖాస్తులన్నింటినీ ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారని పేర్కొన్నారు.

యాదాద్రిలో అష్టోత్తర పూజలు


స్వామివారికి హారతినిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి పుణ్యక్షేత్రంలో శనివారం సంప్రదాయ పూజలు కొనసాగాయి. వేకువజామున శ్రీస్వామి అమ్మవార్లకు సుప్రభాతం నిర్వహించారు. అనంతరం స్వయంభూ, ప్రతిష్ఠా అలంకార మూర్తులకు నిజాభిషేకం, తులసీదళాలతో అర్చన చేశారు. ఇక ఆలయ ముఖ మండపంలో సువర్ణ పుష్పార్చన మూర్తులకు అష్టోత్తర పూజలు, ప్రథమ ప్రాకార మండపంలో శ్రీసుదర్శన నారసింహహోమం, గజవాహనసేవ, నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవం తదితర కైంకర్యాలు గావించారు. సాయంత్రం జోడు సేవలను ఆలయ మాఢవీధిలో ఊరేగించారు. సువర్ణ పుష్పార్చన, వేద ఆశీర్వచనంలో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

'మహిళలను రక్షిద్దాం'


సూర్యాపేటలో నిర్వహించిన బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న మల్లు లక్ష్మి, మహిళలు

దురాజ్‌పల్లి (సూర్యాపేట): మహిళలను, దేశాన్ని రక్షిద్దాం అనే నినాదంతో దేశ, రాష్ట్రవ్యాప్తంగా జీపు జాతాల ద్వారా మహిళల్లో చైతన్యం కల్పించామని ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి అన్నారు. చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఐద్వా జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శనివారం సూర్యాపేటలోని నల్లాలబావి సెంటర్‌లో బతుకమ్మ ఆడి పాడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశవ్యాప్తంగా మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టాలన్నారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి మేకన బోయిన సైదమ్మ, ఐద్వా రాష్ట్ర కమిటీ సభ్యురాలు మద్దెల జ్యోతి, రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యురాలు రజిత పాల్గొన్నారు.

పక్కాగా కోడ్ అమలు



- ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా చర్యలు
- సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో అదనపు భద్రత
- మూడు చోట్ల అంతర్రాష్ట్ర చెక్ పోస్టులు పెట్టాం..
- వాటి వద్ద కేంద్ర బలగాలను వినియోగిస్తాం
- నగదు రవాణాపై ప్రత్యేక దృష్టి
- సోషల్ మీడియా కామెంట్స్ పైనా నిఘా

'సాక్షి'తో జిల్లా ఎస్పీ అపూర్వరావు

SAKSHI INTERVIEW సాక్షి

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: అసెంబ్లీ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించడానికి అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని, ప్రజలంతా ఓటు హక్కును వినియోగించుకోవాలని జిల్లా ఎస్పీ అపూర్వరావు చెప్పారు. కేంద్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా పోలీసులకు అవసరమైన శిక్షణ కూడా పూర్తి చేశామని వెల్లడించారు. ఎన్నికల కోడ్ అమలుకు పకడ్బందీ చర్యలు చేపట్టామన్నారు. జిల్లాలో ఎన్నికల నిర్వహణకు పోలీస్ శాఖ సన్నద్ధత, చేస్తున్న ఏర్పాట్లను ఆమె 'సాక్షి'కి వివరించారు. ఎస్పీ వెల్లడించిన అంశాలు ఆమె మాటల్లోనే..

ఎన్నికల నిర్వహణలో భద్రత కీలకమైన అంశం. అందుకు రాష్ట్ర పోలీసు శాఖకు చెందిన సిబ్బందితో పాటు కేంద్ర బలగాలను వినియోగిస్తాం. ఇప్పటికే జిల్లాకు కేంద్ర బలగాలు కొంతమేర వచ్చాయి. ఇంకా వస్తున్నాయి. జిల్లాలోని ప్రతి మండలంలో తనిఖీలు చేస్తున్నాం. ఫ్లయింగ్ స్క్వాడ్‌లను ఏర్పాటు చేశాం. ఎన్నికల కోడ్‌ను పక్కాగా అమలు చేస్తాం. డబ్బు, మద్యం పంపిణీ కట్టడికి చర్యలు చేపడుతున్నాం. పార్టీలు, అభ్యర్థులు ఉల్లంఘనలకు పాల్పడితే నిబంధనల ప్రకారం చర్యలు చేపడతాం. అడవిదేవులపల్లి, వాడపల్లి, నాగార్జునసాగర్ వద్ద అంతర్రాష్ట్ర చెక్ పోస్టులను ఏర్పాటు చేశాం. వాటి వద్ద స్థానిక పోలీసులతో పాటు కేంద్ర బలగాలను వినియోస్తాం.

రూ.50 వేలకు మించి తీసుకెళ్లాల్సివస్తే ఆధారాలు తప్పనిసరి

నగదు రవాణా విషయంలో కఠినంగా వ్యవహరిస్తున్నాం. ప్రజలు తమ అవసరాల కోసం రూ.50 వేల కంటే ఎక్కువ నగదు తీసుకెళ్లొద్దు. తీసుకెళ్లాల్సి వస్తే వాటికి సంబంధించిన ఆధారాలను తమ వెంట ఉంచుకోవాలి. లెక్కలు లేకుండా తీసుకెళ్తూ పట్టుపడితే, గ్రీవెన్స్ కమిటీలో విజ్ఞప్తి చేయాలి. ప్రజలు ఆస్పత్రి అవసరాలు, వ్యవసాయ, వ్యాపార సంబంధిత

3200 మంది బైండోవర్

రౌడీ షీటర్లు, గత ఎన్నికల్లో సమస్యలు సృష్టించే ప్రయత్నం చేసి, కేసుల్లో ఉన్న వారు, వివిధ కిమినల్ కేసుల్లో పాత్ర ఉన్న వారు 3200 మందిని ఇప్పటివరకు బైండోవర్ చేశాం. వారి కదలికపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశాం. ఇప్పటికే వారికి కౌన్సెలింగ్ నిర్వహించాం. పోలింగ్ నాటికి మరోసారి కౌన్సెలింగ్ ఇస్తాం. ఎన్నికల నేపథ్యంలో ఎక్కడైనా ఘర్షణలు, హింస వంటి అవాంచనీయ ఘటలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవు.

డబ్బులుగా ఆధారాలు అందజేస్తే విడుదల చేస్తారు. దీనిని పర్యవేక్షించేందుకు ప్రత్యేకంగా డీఎస్పీని అందుబాటులో ఉంచాం.

సమస్యాత్మక కేంద్రాల్లో పటిష్ట భద్రత

గత ఎన్నికల్లో జరిగిన సంఘటలన ఆధారంగా, మారుమూల ప్రాంతాల్లోని పరిస్థితులను బట్టి 314 ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన 521 పోలింగ్ కేంద్రాలను సమస్యాత్మక కేంద్రాలుగా గుర్తించాం. వాటి వద్ద రాష్ట్ర పోలీసులతోపాటు సీఆర్‌పీఎఫ్ బలగాలతో భద్రత కల్పిస్తాం. సీనియర్ అధికారులతో పర్యవేక్షిస్తాం. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లు చేస్తున్నాం.

ర్యాలీలు, సభలు, సమావేశాలకు అనుమతి తప్పనిసరి


ఎన్నికల ప్రచారంలో భాగంగా ర్యాలీలు, సభలు, సమావేశాలు నిర్వహించాలంటే ముందస్తుగా పోలీసు శాఖ నుంచి తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలి. ర్యాలీల్లో వినియోగించే వాహనాలకు కూడా అనుమతి ఉండాలి. అనుమతి లేకుండా సభలు, ర్యాలీలు నిర్వహిస్తే ఎన్నికల నిబంధనల ప్రకారం చర్యలు చేపడతాం. రాత్రి 10 గంటల నుంచి ఉదయం 6 గంటలకు ప్రచార కార్యక్రమాలు నిర్వహించడానికి వీల్లేదు. కరపత్రాలపై.. అవి ఎక్కడ ముద్రించారనే వివరాలు ఉండాలి. సోషల్ మీడియాలో పార్టీలు, కులాలు, మతాల పేరుతో ఇతరులను రెచ్చగొట్టేలా, ఘర్షణకు తావిచ్చేలా కామెంట్స్ పెట్టినా, పోస్టులు చేసినా వారిపై చర్యలు చేపడతాం. ప్రత్యేక విభాగంతో సోషల్ మీడియాపై నిరంతర నిఘాను ఏర్పాటు చేశాం. నిబంధనల ఉల్లంఘనలకు సంబంధించి ఎవరైనా 'సి-విజిల్' యాప్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చు.

- పోలీస్ అమరవీరులకు నివాళి


పోలీస్ అమరవీరుల సంస్మరణ దినం సందర్భంగా శనివారం నల్లగొండలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో అమరుల స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ ఆర్‌వీ.కర్ణన్, ఎస్పీ అపూర్వరావు, ఇతర అధికారులు

మెప్మా ఉద్యోగుల్లో గుబులు !

- పే స్కేల్ అమలుకు సర్టిఫికెట్లు పరిశీలించాలని ప్రభుత్వం ఆదేశం
- 26న వెరిఫికేషన్ చేయనున్న ఉన్నతాధికారులు
- బదిలీకి ప్రయత్నిస్తున్న కొందరు ఉద్యోగులు?



నల్లగొండలోని మెప్మా కార్యాలయం

నల్లగొండ టూటౌన్: మెప్మా కార్యాలయాల్లో విధులు నిర్వర్తిస్తున్న ఉద్యోగులను రాష్ట్ర ప్రభుత్వం పే స్కేల్ పరిధిలోకి తీసుకొచ్చింది. ఇటీవల వరకు ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులుగా ఉన్న వీరికి గతంలోనే హెఆర్ పాలసీ తీసుకురాగా, తాజాగా పే స్కేల్ వర్తింపజేయాలని నిర్ణయం తీసుకుంది. జిల్లాలోని నల్లగొండ, మిర్యాలగూడ, దేవరకొండ మున్సిపాలిటీలతోపాటు జిల్లా మెప్మా కార్యాలయంలో మొత్తం 16 మంది ఉద్యోగులు ఉన్నారు. వీరిలో ఇద్దరు ఉద్యోగులకు పే స్కేల్ వర్తింపజేయడానికి నిబంధనలు అంగీకరించడంలేదని తెలుస్తోంది. మిగతా 14 మంది ఉద్యోగులకు పే స్కేల్ అమలు చేయనున్నారు. పే స్కేల్ అమలు చేయడానికి సంబంధిత ఉద్యోగుల సర్టిఫికెట్లను పరిశీలించాలని ఉన్నతాధికారులు నిర్ణయించారు. ఈ 16 మందిలో కొందరు అప్పట్లోనే పైరవీలతో ఉద్యోగాలు పొందారనే ఆరోపణలు ఉన్నాయి. వీరి విద్యార్హతపై కూడా అధికారులకు ఫిర్యాదులు రావడంతోనే సర్టిఫికెట్ల వెరిఫికేషన్ పెట్టినట్లు తెలిస్తోంది. మొదట్లో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులుగా తీసుకోవడం, జీతం కూడా అప్పట్లో తక్కువగా ఉండడంతో వీరి ఉద్యోగాలను అంత సీరియస్‌గా తీసుకోలేదు. రాజకీయ పలుకుబడి ఉన్నవారు కొందరు ఉద్యోగాలు పొందారనే ఆరోపణలు ఉన్నాయి. తాజాగా పే స్కేల్ వర్తింజేసి సర్టిఫికెట్ల పరిశీలన చేయాలనడంతో ఉద్యోగుల్లో గుబులు మొదలైంది.

24న సర్టిఫికెట్లు అందించాలి

జిల్లాలో మొత్తం 14 మందికి సంబంధించి సర్టిఫికెట్లను ఈనెల 24వ తేదీన జిల్లా కేంద్రంలోని మెప్మా కార్యాలయంలో అందజేయాల్సి ఉంటుంది. ఈ సర్టిఫికెట్లను ఈనెల 26న హైదరాబాద్‌లో ఉన్నతాధికారులు క్షుణ్ణంగా పరిశీలించనున్నారు. దాంతో కొందరు ఉద్యోగులు ఇక్కడి నుంచి ఇతర ప్రాంతాలకు బదిలీల కోసం ప్రయత్నిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఓ ఉన్నతాధికారి సహకారంతో తీవ్రంగా ప్రయత్నాలు చేస్తున్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి.

నేడే సద్దుల బతుకమ్మ


నల్లగొండలోని గడియారం సెంటర్‌లో పూలు కొనుగోలు చేస్తున్న మహిళలు

రామగిరి(నల్లగొండ): తెలంగాణ సంస్కృతీసంప్రదాయాలకు ప్రతీక అయిన బతుకమ్మ ఉత్సవాలు ఆదివారంతో ముగియనున్నాయి. ఎనిమిది రోజులుగా ఉత్సాహంగా వేడుకలు జరుపుకున్న మహిళలు, యువతులు చివరి దినమైన తొమ్మిదో రోజు సద్దుల బతుకమ్మకు సిద్ధమయ్యారు. ఈ సందర్భంగా పల్లెలు, పట్టణాల్లో ఆలయాలు, ప్రధాన కూడళ్ల వద్ద బతుకమ్మ ఆడేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. దీంతో పల్లెలు, పట్టణాలు తీరొక్క పూల శోభ సంతరించుకోనుంది. ఈ క్రమంలో నల్లగొండ జిల్లా కేంద్రంతోపాటు జిల్లాలోని పలు పట్టణాల్లో వెలిసిన పూల విక్రయ కేంద్రాలు కొనుగోలుదారులతో కిటకిటలాడాయి. చెరువుల వద్ద నిమజ్జన ప్రదేశాల్లో కూడా ఏర్పాట్లు చేశారు.

దళిత డిక్లరేషన్ కోసం పోరాడుదాం


సమావేశంలో మాట్లాడుతున్న నాగయ్య

నల్లగొండ టౌన్: రాజ్యాంగ రిజర్వేషన్లు, దళిత డిక్లరేషన్ కోసం పోరాడుదామని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జి.నాగయ్య పిలుపునిచ్చారు. శనివారం నల్లగొండ జిల్లా కేంద్రంలోని అంబేడ్కర్ భవన్‌లో జరిగిన రౌండ్‌టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులను వారి అభ్యున్నతికే ఖర్చుచేయాలని డిమాండ్ చేశారు. రిటైర్డ్ ఐఏఎస్ అధికారి చొల్లేటి ప్రభాకర్ మాట్లాడుతూ ప్రజా పంపిణీ వ్యవస్థను తీసి వేయాలని ప్రభుత్వం కుట్ర పన్నుతోందన్నారు. పాలడుగు నాగార్జున, బలుగూరు నర్సింహ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఆయా సంఘాల నాయకులు నారి ఐలయ్య, బొజ్జ వెంకులు, పాలడుగు ప్రభావతి, ఎడ్ల సైదులు, నన్నూరి వెంకటరమణారెడ్డి, కొండేటి శ్రీను, వెంకటయ్య, పరశురాములు, చినపాక లక్ష్మీనారాయణ, వంటిపాక యాదగిఇర, కట్టెల శివకుమార్, కొండా వెంకన్న, మంజులగౌడ్, పబ్బు వీరస్వామి, శ్రీశైలం, సన్ని, గాదె నర్సింహ, దండెంపల్లి సత్తయ్య పాల్గొన్నారు.

ఈవీఎంల తరలింపు


ఓటింగ్ యంత్రాలను నియోజకవర్గాలకు పంపిస్తున్న ఎన్నికల సిబ్బంది

నల్లగొండ: జిల్లాలోని ఆరు అసెంబ్లీ నియోజకవర్గాలకు కేటాయించిన ఎన్నికల పోలింగ్‌కు సంబంధించి ఓటింగ్ యంత్రాలను శనివారం జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఆర్‌వీ.కర్ణన్ సమక్షంలో క్షుణ్ణంగా పరిశీలించి ఆయా ప్రాంతాలకు తరలించారు.

నియోజకవర్గాల వారీగా కేటాయింపు..

నియోజక వర్గం	బీయూలు	సీయూలు	వీవీ ప్యాట్లు
దేవరకొండ	385	385	431
నాగార్జునసాగర్	373	373	418
మిర్యాలగూడ	328	328	368
నల్లగొండ	355	355	397
మునుగోడు	383	383	429
నకిరేకల్	381	381	427
మొత్తం	2,205	2,205	2,470

మొత్తం 3,658 బ్యాలెట్ యూనిట్లు (బీయూ), 2,903 కంట్రోల్ యూనిట్లు(సీయూ), 2,847 వీవీ ప్యాట్లతో కలిపి మొత్తం 9,408 ఓటింగ్ యంత్రాలను కేటాయించారు. ఇందులో మూడు విభాగాల నుంచి మొత్తం 6,880 యంత్రాలను నియోజకవర్గాలకు తరలించారు. అత్యవసరమైతే పంపేందుకు మిగతావి స్ట్రాంగ్‌రూమ్‌లో ఉంచారు.

ఒక్క రోడ్డు వేసి అభివృద్ధి అంటున్నారు


కోమటిరెడ్డికి హారతి ఇస్తున్న మహిళ


నల్లగొండలో బైక్‌పై తిరుగుతూ ప్రచారం నిర్వహిస్తున్న కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి


- బీఆర్‌ఎస్‌లో నాయకులను గౌరవించే సంస్కృతి లేదు
- ఎన్నికల ప్రచారంలో ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

నల్లగొండ: నల్లగొండ పట్టణంలో ఒక్క రోడ్డు వేసి అభివృద్ధి అంటున్నారు.. అంతా తన హయాంలో చేపట్టిన అభివృద్ధేనని భువనగిరి ఎంపీ, కాంగ్రెస్ పార్టీ నల్లగొండ ఎమ్మెల్యే అభ్యర్థి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. నల్లగొండ పట్టణంలోని ఎలిశాల కాలనీలో పలు కుటుంబాలను కలిశారు. అనంతరం వీటీ కాలనీలో ఆలయం, దేవరకొండ రోడ్డులో గల దుర్గాదేవి విగ్రహం వద్ద పూజలు చేసి పలు కాలనీల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్‌ను వీడి కాంగ్రెస్ పార్టీలో చేరిన కౌన్సిలర్లు, కార్యకర్తలపై లేనిపోని ఆరోపణలు చేస్తే సహించేది లేదన్నారు. కాంగ్రెస్‌లో గెలిచిన ఎమ్మెల్యేలంతా బీఆర్‌ఎస్‌లో చేరారని, వారిని కేసీఆర్ ఎన్ని డబ్బులు ఇచ్చి కొన్నారో చెప్పాలని నిలదీశారు. బీఆర్‌ఎస్‌లో నాయకులు, కార్యకర్తలను గౌరవించే సంస్కృతి లేదని, అందుకే కాంగ్రెస్‌లో చేరుతున్నారన్నారు. నా మీద విమర్శలు చేయడాన్ని ప్రజలు గమనిస్తున్నారని, ఈ ఎన్నికల్లో తగిన రీతిలో బుద్ధి చెబుతారని హెచ్చరించారు. తాను భువనగిరి ఎంపీగా ఉన్నప్పటికీ నల్లగొండ నియోజకవర్గ ప్రజలకు ఎవరికి ఏ ఆపద వచ్చినా ఆదుకున్నానన్నారు. అందుకే నాలుగేళ్ల తర్వాత నల్లగొండకు వచ్చినా ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాబోతుంది.. ప్రజల కష్టాలు తీరబోతున్నాయన్నారు. తాను గెలుపొందిన తర్వాత నల్లగొండలో రోడ్డు వెడల్పులో ఇళ్లు కోల్పోయిన వారికి నష్టపరిహారం ఇప్పిస్తానన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు గుమ్ముల మోహన్‌రెడ్డి, కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ బుర్రి శ్రీనివాస రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్, ప్రదీప్‌నాయక్, బషీర్, ఖయ్యూంబేగ్, సమీ, ఇతర కౌన్సిలర్లు, నాయకులు పాల్గొన్నారు.

లీడర్.. పండుగ ఆఫర్!

దసరా ప్యాకేజీలు సిద్ధం చేస్తున్న ఆయా పార్టీల అభ్యర్థులు

- ఇంటింటికీ మద్యం, మటన్, మహిళలకు చీరలు పంచే అవకాశం
- స్థానిక నాయకులకు బాధ్యతలు
- గుట్టుచప్పుడు కాకుండా ఏర్పాట్లు



సాక్షి, యాదాద్రి : ఎన్నికల వేళ ప్రధాన రాజకీయ పార్టీలు దసరా ప్యాకేజీలు ఇవ్వడానికి సిద్ధమవుతున్నాయి. ఇంటింటికీ మద్యం, మటన్, టపాసులతో పాటు మహిళలకు చీరలు పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నాయి. ఇందుకు సంబంధించిన బాధ్యతలను ఇప్పటికే స్థానిక నాయకత్వానికి అప్పగించినట్లు సమాచారం. ఓటర్లు సైతం పండుగకు తమకేమిస్తారన్న ఆశతో ఉన్నారు. అక్కడక్కడ నాయకులను ప్రశ్నిస్తున్నట్లు తెలుస్తోంది.

ఖర్చు ఎంతయినా సరే..

ప్రధాన రాజకీయ పక్షాలైన బీఆర్‌ఎస్, కాంగ్రెస్, బీజేపీలు ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకుంటున్నాయి. గెలిచి తీరాలన్న పట్టుదలతో సర్వశక్తులొడ్డుతున్నాయి. అందుకోసం ఓటర్లను ఆకట్టుకునేందుకు రంగంలోకి దిగాయి. కుల, మహిళా, యువజన సంఘాలను మచ్చిక చేసుకునే పనిలో ఉన్నాయి. ఇందుకోసం దసరా పండుగను సద్వినియోగం చేసుకునే ప్రయత్నం చేస్తున్నాయి. మద్యం, మటన్ పంపిణీకి ఇప్పటికే ప్రణాళిక సిద్ధం చేసుకున్నట్లు తెలుస్తోంది. అతేకాకుండా మహిళలకు చీరలు, యువతకు ప్రత్యేక ప్యాకేజీలు ఇచ్చే ఇచ్చేందుకు సిద్ధమయ్యారు. ఖర్చు తడిసిమోపడవుతున్నా ఓటర్లను ఆకర్షించేందుకు అభ్యరుథులు వెనుకాడడం లేదు.

బతుకమ్మ పండుగకు భారీ ఖర్చు

ఓ ప్రధాన పార్టీ అభ్యర్థి సతీమణి మహిళా ఓటర్లను ఆకట్టుకునేందుకు విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. అందులో భాగంగా బతుకమ్మ పండుగకు లక్షల రూపాయలు ఖర్చు చేస్తున్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా బతుకమ్మ పోటీలు నిర్వహిస్తూ నగదు, చీరలు, ఆభరణాలను బహుమతులుగా ఇస్తున్నట్లు తెలుస్తోంది. అంతేకాకుండా మహిళా సంఘాల సభ్యులకు డబ్బులు పంపిణీ చేస్తున్నారన్న ప్రచారం జరుగుతోంది. బతుకమ్మ పండుగ సందర్భంగా ఒక్కో సభ్యురాలికి రూ.1000 చొప్పున పంపిణీ చేసినట్లు తెలుస్తోంది. మరో ప్రధాన పార్టీ నాయకులు సైతం తామేమీ తీసిపోమని మహిళా ఓటర్లను ఆకట్టుకునే పనిలో పడ్డారు.

డబ్బులు డిమాండ్!

దసరా పండుకు మద్యం, మటన్ ఇతర తాయిలాలు పంపిణీ చేసేందుకు ఆయా రాజకీయ పార్టీల అభ్యర్థులు ఏర్పాట్లు చేసుకుంటుండగా.. పలుచోట్ల ఓటర్లు తమకు డబ్బే కావాలని డిమాండ్ చేస్తున్నట్లు తెలుస్తోంది. ఆలేరు నియోజకవర్గంలో పలు చోట్ల చీరలకు డబ్బులు ఇవ్వాలని మహిళా సంఘాలు నాయకులపై ఒత్తిడి తెస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది.

ఏ పార్టీ ఇచ్చినా కాదనకుండా..

దసరా పండుగకు అభ్యర్థులు ఇచ్చే ప్యాకేజీలను తీసుకోవడానికి ఓటర్లు కూడా సిద్ధంగా ఉన్నారు. ఫలానా పార్టీ అని కాకుండా ఏ పార్టీ ఇచ్చినా తీసుకుంటామని బహిరంగంగానే చెబుతున్నారు.

తెలంగాణ గుమ్మం.. కోదాడ


కోదాడ పట్టణ వ్యూ



- తెలంగాణ– ఆంధ్రా సంప్రదాయాలు మిళితమైన నియోజకవర్గం
- ఓటింగ్‌లో వివిధ ప్రాంతాల ఓటర్ల ప్రభావం

కోదాడ : తెలంగాణ–ఆంధ్రప్రదేశ్ సరిహద్దుగా, మూడు జిల్లాల కూడలిగా ఉన్న కోదాడ ఓటర్లు ప్రతి ఎన్నికల్లో విలక్షణ తీర్పు ఇస్తుంటారు. 1978వ సంవత్సరంలో ఏర్పడిన ఈ నియోజకవర్గంలో 10 సార్లు ఎన్నికలు జరిగాయి. 1978లో జరిగిన తొలి ఎన్నికల్లో ఇక్కడ నుంచి జనతా పార్టీ తరుపున అక్కిరాజు వాసుదేవరావు విజయం సాధించగా ఆ తరువాత ఎన్నికల్లో ఐదు సార్లు టీడీపీ, రెండు సార్లు కాంగ్రెస్, ఒక సారి టీఆర్‌ఎస్ విజయం సాధించాయి. గత ఎన్నికల్లో కాంగ్రెస్, టీఆర్‌ఎస్ నుంచి పోటీ పడిన వారే ఇప్పుడూ ఆయా పార్టీల నుంచి బరిలో దిగుతున్నారు.


అక్కిరాజు వాసుదేవరావు


వీరేపల్లి లక్ష్మీనారాయణరావు


వేనేపల్లి చందర్‌రావు


నలమాద ఉత్తమ్‌కుమార్‌రెడ్డి


నలమాద పద్మావతిరెడ్డి


బొల్లం మల్లయ్య యాదవ్

మూడు జిల్లాల కూడలి..

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో కోదాడ నియోజకవర్గానికి ఎన్నో ప్రత్యేకతలు ఉన్నాయి. ఖమ్మం, కృష్ణా, నల్లగొండ జిల్లాలకు కూడలిగా ఉన్న ఈ నియోజకవర్గ కేంద్రం ఇప్పుడు తెలంగాణ ముఖద్వారంగా మారింది. విజయవాడ– హైదరాబాద్ జాతీయ రహదారి నియోజకవర్గం మీదుగా పోతోంది. తెలంగాణ భాష, యాస ఇక్కడ ఏమాత్రం కనిపించదు. ఆచార వ్యవహారాలు కూడా ఆంధ్రా, తెలంగాణ మిళితమై ఉంటాయి. ఆంధ్రా ప్రాంతం నుంచి ఇక్కడకు వచ్చి స్థిర పడినవారు ఎక్కువగా ఉండడంతో ప్రతి ఎన్నికల్లో వీరి ప్రభావం ఎక్కువగానే ఉంటుంది. ఉమ్మడి జిల్లాలో ఎక్కడా లేని విధంగా ఇక్కడ అనేక విద్యా సంస్థలున్నాయి.

రాజకీయంగా చైతన్యం ఎక్కువే..

రాజకీయంగా కోదాడ చైతన్యవంతమైంది. ఇక్కడ ఉన్న కేఆర్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వామపక్ష విద్యార్థి సంఘాల ప్రభావంతో ఆ భావజాలం ఉన్న యువత ఎక్కువగా ఉండేది. గతంలో సీపీఐ, సీపీఎంలు బలంగా ఉండేవి. తెలుగుదేశం ఆవిర్భావం తర్వాత ఆంధ్రా ప్రభావంతో ఇక్కడ ఆ పార్టీ వరుసగా నాలుగు సార్లు విజయం సాధించింది. కాలక్రమేణా వామపక్షాల ప్రభావం తగ్గింది.. కాంగ్రెస్ పార్టీ పుంజుకుంది.

సాగర్ ఆయకట్టుతో సుభిక్షం..

కోదాడ నియోజకవర్గ పరిధిలోని కోదాడ, మునగాల, చిలుకూరు, నడిగూడెం, అనంతగిరి మండలాలు సాగర్ ఎడమకాలువ కింద ఉండడంతో వరి సాగు చేస్తుంటారు. రెండు పంటలు పండుతుండంతో రైతాంగం ఆర్థికంగా బలోపేతంగా ఉంటుంది. మోతె మండలానికి, మునగాల, నడిగూడెం మండలాల్లోని ఆయకట్టేతర గ్రామాలకు ఈ సంవత్సరం కాళేశ్వరం జలాలు రావడంతో నియోజకవర్గం వ్యవసాయ రంగంలో అభివృద్ధి చెందుతోంది.

కోదాడ ఎమ్మెల్యేలు ఇలా..

సంవత్సరం	గెలిచినవారు	పార్టీ	ఓడినవారు పార్టీ	మెజార్టీ
1978	అక్కిరాజు వాసుదేవరావు	జనతా	కె.లక్ష్మణరాజు	కాంగ్రెస్
1983	వీరేపల్లి లక్ష్మీనారాయణ	టీడీపీ	చింతా చంద్రారెడ్డి	కాంగ్రెస్
1985	వేనేపల్లి చందర్‌రావు	టీడీపీ	చింతా చంద్రారెడ్డి	కాంగ్రెస్
1989	వేనేపల్లి చందర్‌రావు	టీడీపీ	వి.లక్ష్మీనారాయణ	కాంగ్రెస్
1994	వేనేపల్లి చందర్‌రావు	టీడీపీ	ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి	కాంగ్రెస్
1999	ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి	కాంగ్రెస్	చందర్‌రావు	టీడీపీ
2004	ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి	కాంగ్రెస్	చందర్‌రావు	టీడీపీ
2009	వేనేపల్లి చందర్‌రావు	టీడీపీ	మహబూబ్‌జానీ	కాంగ్రెస్
2014	ఎన్.పద్మావతి	కాంగ్రెస్	మల్లయ్యయాదవ్	టీడీపీ
2018	బొల్లం మల్లయ్యయాదవ్	టీఆర్‌ఎస్	ఎన్.పద్మావతి	కాంగ్రెస్

కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీలను నమ్మొద్దు

త్రిపురారం : ప్రజలు మరోసారి కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీలను నమ్మి మోసపోవద్దని బీజేపీ జిల్లా అధ్యక్షుడు కంకణాల శ్రీధర్‌రెడ్డి అన్నారు. శనివారం త్రిపురారం మండలంలోని పెద్దదేవులపల్లి, నర్లకంటిగూడెం గ్రామాల్లో ఇంటింటికీ తిరుగుతూ బీజేపీ ప్రజా సంక్షేమ పథకాలపై ప్రజలు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఓటర్లు అభివృద్ధి చేసే పార్టీలను గుర్తించాలన్నారు. బీజేపీ గెలుపే లక్ష్యంగా కార్యకర్తలు పని చేయాలని సూచించారు. కార్యక్రమంలో కంకణాల నివేదితరెడ్డి, జిల్లా బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు సుంకిరెడ్డి నారాయణరెడ్డి, దామెర సంతోష్, గండి కోట గోపి, కందుకూరి సైదులు, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.


పెద్దదేవులపల్లిలో కేంద్ర పథకాలపై అవగాహన కల్పిస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి

- స్ట్రాంగ్ రూమ్‌లకు ఈవీఎంలు..





నల్లగొండలోని ఈవీఎం గోదాము నుంచి డిస్ట్రిబ్యూషన్ సెంటర్లలోని స్ట్రాంగ్ రూమ్‌లకు ఈవీఎంలను తరలిస్తున్న అధికారులు, గోదాము వద్ద కేంద్ర బలగాల బందోబస్తు - సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్ నల్లగొండ

జంగ్ తెలంగాణ

ఓడి.. గెలిచారు గెలిచి.. ఓడారు!

ప్రజా స్వామ్యంలో ఎన్నికలంటేనే జయాపజయాలు. ఓటమితో కుంగిపోకుండా విజయం కోసం నిరంతరం ప్రజాసేవలో ఉంటూ విజయాన్ని సొంతం చేసుకున్నారు కొందరు నేతలు. ఓటమి.. విజయానికి నాంది అని అంటుంటారు. ఒక ఓటమిని జీర్ణించుకుని.. గెలుపు బాటన నడవడం ఆషామాషీ వ్యవహారం కాదు. పోయినచోటే వెతుక్కుని ఓడిన చోటే గెలిచి నిలిచిన వారు ఎందరో ఉమ్మడి నల్లగొండ జిల్లా రాజకీయ ముఖ చిత్రంలో ఉన్నారు. రాజకీయ ఘనాపాఠీలతో సైతం గెలుపు ఓటములు దోబూచులాడాయి. - సాక్షి, యాదాద్రి



ఆలేరులో..

ఆలేరు అసెంబ్లీ నియోజకవర్గంలో 1994లో జరిగిన ఎన్నికల్లో టీడీపీ నుంచి పోటీచేసిన మోత్కుపల్లి నర్సింహులు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి డాక్టర్ నగేష్‌పై విజయం సాధించారు. 1999లో జరిగిన ఎన్నికల్లో తిరిగి అదే పరిస్థితి ఎదురైంది. అభ్యర్థులు వారే అయినప్పటికి పార్టీలు మారాయి. కాంగ్రెస్ పార్టీ నుంచి మోత్కుపల్లి, టీడీపీ నుంచి డాక్టర్ నగేష్ పోటీ చేయగా.. మోత్కుపల్లి విజయం సాధించారు. 2004 వరకు పరిస్థితి మారింది టీఆర్‌ఎస్ అభ్యర్థిగా పోటీ చేసిన నగేష్.. టీడీపీ అభ్యర్థి మోత్కుపల్లి నర్సింహులుపై విజయం సాధించారు. తెలంగాణ కోసం కేసీఆర్ పిలుపు మేరకు తన ఎమ్మెల్యే పదవికి నగేష్ రాజీనామా చేయడంతో 2008లో ఉప ఎన్నిక వచ్చింది. ఈ ఎన్నికలో టీఆర్‌ఎస్ నుంచి మళ్లీ పోటీచేసిన డాక్టర్ నగేష్.. టీడీపీ అభ్యర్థి మోత్కుపల్లిపై విజయం సాధించారు. ఆ తర్వాత ఆలేరు రిజర్వుడు స్థానం జనరల్ కేటగిరీలోకి మారింది. వేర్వేరు పార్టీల నుంచి పోటీచేసినా వారికి విజయం దక్కలేదు.

తుంగతుర్తిలో ఇలా..

తుంగతుర్తి నియోజకవర్గంలో 1985 నుంచి 1994 వరకు వరుసగా మూడుసార్లు గెలిచిన రాంరెడ్డి దామోదర్‌రెడ్డి 1999 జరిగిన ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి సంకినేని వెంకటేశ్వర్‌రావు చేతిలో ఓడిపోయారు. 2004లో జరిగిన సాధారణ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేసిన రాంరెడ్డి దామోదర్‌రెడ్డి అప్పటి టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసిన సంకినేనిపై విజయం సాధించారు. ఆ తర్వాత తుంగతుర్తి ఎస్సీ రిజర్వుడు నియోజకవర్గంగా మారింది.

చలకుర్తిలో..

ప్రస్తుతం నాగార్జునసాగర్ నియోజకవర్గం 2009 ఎన్నికలకు ముందు చలకుర్తిగా ఉంది. చలకుర్తి నియోజకవర్గంలో 1978లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసిన నిమ్మల రాములు జనతా పార్టీ అభ్యర్థి కుందూరు జానారెడ్డిపై విజయం సాధించారు. 1983లో టీడీపీ ఆవిర్భావంతో ఆ పార్టీలో చేరి పోటీ చేసిన జానారెడ్డి.. కాంగ్రెస్ అభ్యర్థి నిమ్మల రాములుపై విజయం సాధించారు. 1994లో టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసిన గుండెబోయిన రామ్మూర్తి యాదవ్.. కాంగ్రెస్ అభ్యర్థి కె.జానారెడ్డిపై విజయం సాధించడంతో రెండవసారి జానారెడ్డి ఓటమి పాలయ్యారు. 1999లో, 2004లో కాంగ్రెస్ అభ్యర్థి జానారెడ్డి టీడీపీ అభ్యర్థి రామ్మూర్తి యాదవ్‌పై రెండు సార్లు గెలుపొందారు.

నకిరేకల్‌లో..

1967లో సీపీఎం అభ్యర్థిగా పోటీచేసిన నర్రా రాఘవరెడ్డి కాంగ్రెస్ అభ్యర్థి ఎం.కమలమ్మపై విజయం సాధించారు. తిరిగి 1972లో జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీచేసిన కమలమ్మ సీపీఎం అభ్యర్థి నర్రా రాఘవరెడ్డిపై విజయం సాధించారు.

కోదాడ నియోజకవర్గంలో..

కోదాడ నియోజకవర్గంలో 1994లో జరిగిన ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి వేనేపల్లి చందర్‌రావు చేతిలో కాంగ్రెస్ అభ్యర్థి ఎస్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఓటమి పాలయ్యారు. అనంతరం 1999లో కాంగ్రెస్ పార్టీ నుంచి తిరిగి పోటీచేసిన ఉత్తమ్‌కుమార్‌రెడ్డి టీడీపీ అభ్యర్థి వేనేపల్లి చందర్‌రావుపై విజయం సాధించారు.

మునుగోడులో..

మునుగోడు నియోజకవర్గం నుంచి 1967, 1972 జరిగిన రెండు ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన పాల్వాయి గోవర్ధన్‌రెడ్డి సీపీఐ అభ్యర్థి ఉజ్జిని నారాయణరావుపై విజయం సాధించారు. అనంతరం 1989లో సీపీఐ అభ్యర్థిగా పోటీచేసిన ఉజ్జిని నారాయణరావు.. కాంగ్రెస్ అభ్యర్థి పాల్వాయి గోవర్ధన్‌రెడ్డిపై విజయం సాధించారు. 1994లో మరోసారి పోటీచేసిన నారాయణరావు.. ఇండిపెండెంట్ అభ్యర్థిగా పోటీ చేసిన పాల్వాయిపై మరో విజయం నమోదు చేశారు.

ఫిర్యాదులపై సత్వరమే స్పందించాలి

- రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్


వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ కర్ణన్, ఎస్పీ అపూర్వరావు, అదనపు కలెక్టర్లు

నల్లగొండ : ఎన్నికల ప్రవర్తనా నియమావళి ఉల్లంఘన ఫిర్యాదులపై సత్వరమే స్పందించాలని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి వికాస్‌రాజ్ సూచించారు. సాధారణ ఎన్నికల నేపథ్యంలో వివిధ అంశాలకు సంబంధించి చేపట్టాల్సిన చర్యలు, పాటించాల్సిన జాగ్రత్తలపై శనివారం డీజీపీ అంజనీ కుమార్ యాదవ్‌తో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా ఎన్నికల అధికారులు, ఎస్పీలు, పోలీస్ కమిషనర్లకు ఆయన దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఎన్నికల ప్రధాన అధికారి మాట్లాడుతూ ఎన్నికల కోడ్ ఉల్లంఘన ఫిర్యాదులను వెంటనే పరిశీలించి వివరాలతో కూడిన నివేదికను పంపించాలని ఎన్నికల సంఘానికి పంపాలని సూచించారు. మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ (ఎంసీఎంసీ) ద్వారా జారీ చేయాల్సిన అనుమతుల విషయంలోనూ జాప్యానికి తావులేకుండా చూడాలన్నారు. ప్రతిరోజు ఎంసీఎంసీకి వచ్చే దరఖాస్తులు, ఫిర్యాదులను పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని కలెక్టర్లకు సూచించారు. సి విజిల్ ఫిర్యాదులను వెంటనే పరిశీలించి క్షేత్రస్థాయి విచారణ జరిపి నివేదికలు అందించాలన్నారు. నగదు జప్తు చేసే విషయంలో అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని, సాధారణ ప్రజలు, వ్యాపార వర్గాలు ఇబ్బందులు పడకుండా చూడాలన్నారు. రూ.పది లక్షలకు పైగా నగదు పట్టుబడిన సందర్భాల్లో ఆదాయ పన్ను శాఖ అధికారులకు స్వాధీనపర్చాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ ఆర్‌వి.కర్ణన్, ఎస్పీ అపూర్వరావు, అదనపు కలెక్టర్‌లు హేమంత్ కేశవ్ పాటిల్, జె.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం సభను విజయవంతం చేయాలి

- మునుగోడు ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి

మునుగోడు : మునుగోడులో ఈ నెల 26న నిర్వహించే సీఎం బహిరంగ సభకు ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని స్థానిక ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి కోరారు. ఎంపీడీఓ కార్యాలయ సమీపంలో ఏర్పాటు చేస్తున్న సీఎం సభాస్థలిని శనివారం ఆయన పరిశీలించి మాట్లాడారు. సభలో లక్ష మందికిపైగా కూర్చునేందుకు అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. ఆయన వెంట ఎంపీపీ కర్నాటి స్వామి, బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు బండా పురుషోత్తం రెడ్డి, పాల్వాయి జూనియర్ గోవర్ధన్‌రెడ్డి, రావిరాల కుమారస్వామి, సతీష్ తదితరులు ఉన్నారు.

మూడు నియోజకవర్గాల్లో మాడ్గులపల్లి

13 పంచాయతీలు మిర్యాలగూడలో, పది గ్రామాలు సాగర్‌లో, ఐదు గ్రామాలు నల్లగొండలో

మాడ్గులపల్లి : శాసనసభ ఎన్నికల వేళ జిల్లాలోని మాడ్గులపల్లి మండలం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. మూడు నియోజకవర్గాల పరిధిలో ఈ మండలం ఉండడంతో ఆయా రాజకీయ పార్టీల అభ్యర్థులు, నాయకులు ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. మూడు నియోజకవర్గాల అభ్యర్థులు ఇక్కడ ప్రచారం చేయనున్నారు. దీంతో ఈ మండలంలో ప్రత్యేక సందడి నెలకొననుంది.

2016లో మండలం ఏర్పాటు..

పాలనా సౌలభ్యం కోసం ప్రభుత్వం 2016లో రాష్ట్రంలో నూతన మండలాలను ఏర్పాటు చేసింది. ఇందులో భాగంగా మాడ్గులపల్లి మండలం ఆవిర్భవించింది. ఉమ్మడి వేములపల్లి, నిడమనూరు, తిప్పర్తి మండలాల్లోని 28 గ్రామాలతో ఏర్పాటైంది. అప్పటి నుంచి ప్రత్యేక గుర్తింపును సొంతం చేసుకుంది. ఈ మండలంలో మిర్యాలగూడ నియోజకవర్గంలో 13 గ్రామాలు, నాగార్జున సాగర్ నియోజకవర్గం 10, నల్లగొండ నియోజకవర్గంలో 5 గ్రామాలు ఉన్నాయి.



30 వేలకుపైగా ఓటర్లు..

మాడుగులపల్లి మండలంలోని 28 గ్రామాల్లో 30 వేలకుపైగా ఓటర్లు ఉన్నారు. ఇందులో నాగార్జునసాగర్ నియోజకవర్గ పరిధిలోని 10 గ్రామాల్లో 7,500, నల్లగొండ నియోజకవర్గ పరిధిలోని 5 గ్రామాల్లో ఇదే సంఖ్యలో ఉన్నారు. మిర్యాలగూడ నియోజకవర్గ పరిధిలోని 13 గ్రామాల్లో 15 వేల మంది వరకు ఉన్నారు. మిర్యాలగూడ నియోజకవర్గం నుంచి బరిలో నిలిచే అభ్యర్థులకు మాడుగులపల్లి మండలం చాలా కీలకం కానుండగా.. మిగతా రెండు నియోజకవర్గాల అభ్యర్థుల గెలుపోటములను ప్రభావితం చేసే సంఖ్యలో ఓటర్లు ఇక్కడ ఉండడంతో ప్రధాన రాజకీయ పార్టీలు ఈ మండలంపై ప్రత్యేక దృష్టి పెడుతున్నాయి.

ఆడ శిశువును ఎత్తుకొచ్చిన వీధి కుక్క

- రక్షించేందుకు ప్రయత్నించగా అప్పటికే మృతిచెందిన పసికందు
- భువనగిరి పట్టణంలో ఘటన
- వివరాలు సేకరిస్తున్న ఐసీడీఎస్ అధికారులు

భువనగిరి క్రైం: భువనగిరి పట్టణంలో శుక్రవారం అర్ధరాత్రి నవజాత ఆడ శిశువును వీధి కుక్క నోట కరుచుకొని వెళ్తుండగా స్థానికులు రక్షించే ప్రయత్నం చేయగా అప్పటికే ఆ పసికందు మృతిచెందింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. శుక్రవారం అర్ధరాత్రి సుమారు 11గంటల సమయంలో భువనగిరి పట్టణంలోని ఆర్‌బీ నగర్ నుంచి రామస్వామి హోటల్ వైపునకు ఓ వీధి కుక్క అప్పుడే పుట్టిన ఆడ శిశువును నోట కరుచుకొని వెళ్తోంది. ఇది గమనించిన స్థానికులు ఆ శిశువును రక్షించడానికి ప్రయత్నం చేయగా.. అప్పటికే మృతిచెందడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు అక్కడకు చేరుకొని మృతిచెందిన శిశువును భువనగిరి జిల్లా కేంద్ర ఆస్పత్రి మార్చురీలో భద్రపరిచారు. శిశువును కుక్క ఎక్కడి నుంచి తీసుకొచ్చింది, శిశువును ఎవరైనా బహిరంగంగా పడేసారా..? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. కాగా ఆగస్టు 5వ తేదీన భువనగిరి జిల్లా కేంద్రంలోని జగ్జీవన్‌రామ్ భవనం ముందు ఓ శిశువును కుక్కలు పీక్కు తిన్న ఘటన మరవకముందే అలాంటిదే మరొకటి జరిగిందని పట్టణ ప్రజలు అంటున్నారు. భువనగిరి ఐసీడీఎస్ అధికారులు అంగన్‌వాడీ కేంద్రాల్లో వద్ద నమోదైన గర్భిణుల రికార్డులు పరిశీలించి వారి ఇళ్ల వద్దకు వెళ్లి ఆరా తీశారు.

టిప్పర్‌ను ఢీకొట్టిన తూఫాన్ వాహనం

- ఆరుగురికి గాయాలు

తుర్కపల్లి: టిప్పర్‌ను వెనుక నుంచి తూఫాన్ వాహనం ఢీకొట్టింది. ఈ ఘటన తుర్కపల్లి మండలంలోని వాసాలమర్రిలో శనివారం చోటు చేసుకుంది. వివరాలు.. సంగారెడ్డి జిల్లాలోని జహీరాబాద్‌కు చెందిన మల్లికార్జున్, అతడి కుటుంబ సభ్యులు 8 మంది కలిసి శనివారం తూఫాన్ వాహనంలో యాదాద్రి లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకొని తిరిగి సిద్దిపేట జిల్లాలోని కొమురవెల్లికి వెళ్తున్నారు. మార్గమధ్యలో వాసాలమర్రి గ్రామ శివారులోని కల్వర్టు వద్ద ముందు వెళ్తున్న టిప్పర్ సడన్ బ్రేక్ వేయడంతో వెనక నుంచి వీరి తూఫాన్ వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మల్లికార్జున్‌తో పాటు తూఫాన్ వాహనం డ్రైవర్, 3ఏళ్ల వయస్సు గల నిఖితకి తీవ్ర గాయాలయ్యాయి. మరో ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు చికిత్స నిమిత్తం క్షతగాత్రులను 108 వాహనంలో భువనగిరి ఏరియా ఆస్పత్రికి తరలించారు.


ఘటనా స్థలంలో తూఫాన్ వాహనం

నలుగురు గంజాయి విక్రేతల అరెస్ట్

- పరారీలో మరొకరు.. ఒక కారు, మూడు బైక్‌లు స్వాధీనం
- వివరాలు వెల్లడించిన యాదాద్రి భువనగిరి జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ నవీన్‌కుమార్

రామన్నపేట: చౌటుప్పల్ పరిసర ప్రాంతాల్లో గంజాయి విక్రయిస్తున్న నలుగురు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు యాదాద్రి భువనగిరి జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ కె. నవీన్‌కుమార్ శనివారం విలేకరులకు తెలిపారు. వివరాలు.. రామన్నపేట ఎక్సైజ్ పోలీసులు శుక్రవారం చౌటుప్పల్‌లో తనిఖీలు నిర్వహిస్తుండగా.. చౌటుప్పల్ పట్టణానికి చెందిన వాంకుడోతు మోహన్ వద్ద 1.50 కిలోలు, బోదుల సంజీవ వద్ద 1.20 కిలోల గంజాయి దొరికింది. వారిద్దరిని విచారించగా.. చౌటుప్పల్ పట్టణానికే చెందిన ఎంపర్తి సాయికుమార్, క్లోం సాయికుమార్, నడవటి విశ్వేష్ కూడా చత్తీస్‌గఢ్ నుంచి భూపాలపల్లి మీదుగా అద్దె కారులో గంజాయిని తీసుకొచ్చి విక్రయిస్తున్నట్లు తెలిపారు. ఈ మేరకు ఆ ముగ్గురి ఇళ్లకు వెళ్లి ఆరా తీయగా.. అంతకుముందు రోజే భూపాలపల్లి పోలీసులు వారిని పట్టుకొని కారు, సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకోగా, పోలీసుల కళ్లుగప్పి అక్కడి నుంచి పారిపోయి వచ్చినట్లు తెలిసింది. దీంతో స్థానిక ఎక్సైజ్ పోలీసులు చాకచక్యంగా ఎంపర్తి సాయికుమార్, క్లోం సాయికుమార్‌ను అదుపులోకి తీసుకోగా.. వారి వద్ద 700గ్రాముల గంజాయి లభ్యమైంది. నడవటి విశ్వేష్ పరారయ్యాడు. నిందితుల నుంచి మూడు బైక్‌లు, నాలుగు సెల్‌ఫోన్లు, ఒక కారును స్వాధీనం చేసుకొని సీజ్ చేసినట్లు ఎక్సైజ్ సూపరింటెండెంట్ తెలిపారు. కేసు నమోదు చేసి నిందితులను శనివారం కోర్టులో హాజరుపర్చినట్లు పేర్కొన్నారు. పట్టుబడిన వారి ఫోన్‌కాల్ డేటా ఆధారంగా గంజాయి కొనుగోలు చేసిన వారి వివరాలు సేకరించి చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని చెప్పారు. నిందితులను అరెస్ట్ చేసిన సీఐ నాగలత, ఎస్‌ఐలు ఎన్. శంకర్, ఎం. శోభారాణి, ఇతర పోలీసు సిబ్బందిని అభినందించారు.


పట్టుబడిన నిందితులను చూపిస్తున్న ఎక్సైజ్ అధికారులు

కారు ఢీకొని వ్యక్తి దుర్మరణం

నల్లగొండ క్రైం: రోడ్డు దాటుతుండగా కారు ఢీకొని వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన నల్లగొండ మున్సిపాలిటీ పరిధిలోని చర్లపల్లి సమీపంలో చోటుచేసుకుంది. నల్లగొండ రూరల్ ఎస్‌ఐ కంచర్ల భాస్కర్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. చర్లపల్లి సమీపంలోని స్మార్ట్ సిటీలో వెల్డింగ్ పనిచేసేందుకు దామరచర్లకు చెందిన రాంబ్రహ్మాచారి(37) వారం క్రితం వచ్చాడు. శనివారం రాంబ్రహ్మాచారి స్మార్ట్ సిటీ ఎదురుగా నార్కట్‌పల్లి–అద్దంకి రోడ్డు దాటుతుండగా అద్దంకి వైపు వెళ్తున్న కారు అతివేగంగా వచ్చి ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి కుటుంబ సభ్యులకు సమాచారం అందజేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

950 గ్రాముల వెండి కిరీటాలు బహూకరణ



ఆలయాధికారులకు కిరీటాలు అందజేస్తున్న దాత శ్రీనివాస్‌రాజు, కుటుంబ సభ్యులు

యాదగిరిగుట్ట: యాదాద్రి లక్ష్మీనరసింహస్వామికి హైదరాబాద్‌కు చెందిన కాకుమాను శ్రీనివాస్‌రాజు దంపతులు బంగారు పూతతో కూడిన మూడు వెండి కిరీటాలను బహూకరించారు. శనివారం స్వామిని దర్శించుకునేందుకు వచ్చిన శ్రీనివాస్‌రాజు కుటుంబ సభ్యులు, ముఖ మండపంలోని సువర్ణ పుష్పార్చన మూర్తుల వద్ద మూడు కిరీటాలను ఆలయాధికారులకు అందజేశారు.

రైల్వే లైన్ పనులను అడ్డుకున్న గిరిజనులు



బాధిత రైతులతో మాట్లాడుతున్న అధికారులు

మిర్యాలగూడ: దామరచర్ల మండలం విష్ణుపురం నుంచి యాదాద్రి థర్మల్ పవర్‌ప్లాంట్ వరకు జరుగుతున్న రైల్వే లైన్ నిర్మాణ పనులను గిరిజన రైతులు శనివారం అడ్డుకున్నారు. వీర్లపాలెం సమీపంలో నిర్మిస్తున్న 4వేల మెగావాట్ల విద్యుత్ పవర్‌ప్లాంట్‌కు అవసరమయ్యే బొగ్గు రవాణా కోసం 9కి.మీ. మేర రెండు వరుసల రైల్వే లైన్ పనులను రెండేళ్ల క్రితం ప్రారంభించారు. అయితే రైల్వే లైన్ నిర్మాణంలో భూములు కోల్పోయిన రైతులకు ఇప్పటివరకు పరిహారం అందలేదని గ్రామస్తులు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. అయినా ఏ అధికారి స్పందించకపోవడంతో ఆగ్రహంతో బాధితులు రైల్వే లైన్ పనులను అడ్డుకున్నారు. వెంటనే పరిహారం చెల్లించాలని లేకపోతే ఆందోళన విరమించమని భీష్మించడంతో విషయం తెలుసుకున్న టీఎస్ జెన్‌కో అధికారులు, పోలీసులు అక్కడకు చేరుకొని వారికి నచ్చజెప్పే ప్రయత్నించేశారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని ఆర్‌ఐ సతీష్ హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు.

రూ. 8లక్షలు పట్టివేత

మిర్యాలగూడ అర్బన్ : పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్ వద్ద టూ టౌన్ పోలీసులు శనివారం నిర్వహించిన వాహన తనిఖీల్లో రూ.8 లక్షలను గుర్తించి సీజ్ చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం చిత్తూరు జిల్లా పాకాల మండల కేంద్రానికి చెందిన మండడి లక్ష్మీపతినాయుడు మిర్యాలగూడకు చెందిన బూర సైదులు, కుందూరు శ్రీనివాస్‌రెడ్డితో కలిసి కారులో నగదును తీసుకెళ్తుండగా గుర్తించినట్లు సీఐ నరసింహారావు తెలిపారు. పట్టుపడిన నగదుకు సంబంధించి ఎలాంటి ధ్రువపత్రాలు చూపకపోవడంతో సీజ్ చేసి ఆర్డీఓకు అప్పగించినట్లు పేర్కొన్నారు. తనిఖీల్లో ఎస్‌ఐలు కృష్ణయ్య, రాంబాబు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

కేవీకేలో మోడల్ స్కూల్ విద్యార్థుల ఇంటర్న్‌షిప్



విద్యార్థులకు శిక్షణ ఇస్తున్న ట్రైనర్స్

గరిడేపల్లి: మండలంలోని గడ్డిపల్లి మోడల్ స్కూల్‌కు చెందిన 12 మంది విద్యార్థులు గడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్రంలో వ్యవసాయ సంబంధిత అంశాలపై ఇంటర్న్‌షిప్ చేస్తున్నారు. ఈ సందర్భంగా శనివారం మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ సుధాకర్, లక్ష్య కంపెనీ సీఈఓ కస్తూరి రేవతి, ఒకేషనల్ కోఆర్డినేటర్ స్వామి, ఒకేషనల్ ట్రైనర్ శ్రీను విద్యార్థులకు పలు అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థుల్లో వృత్తి నైపుణ్యాన్ని వెలికితీసేందుకు రాష్ట్ర ప్రభుత్వం వృత్తి విద్యా కోర్సును అందుబాటులోకి తెచ్చినట్లు తెలిపారు. సాధారణ విద్యతో పాటు వృత్తి విద్యా కోర్సులు చేయడంతో విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెంపొందుతుందన్నారు. కార్యక్రమంలో కేవీకే సీనియర్ శాస్త్రవేత్త లవకుమార్, హార్టికల్చర్ శాస్త్రవేత్త నరేష్ పాల్గొన్నారు.

వైభవంగా నిత్య కల్యాణం

మఠంపల్లి: మట్టపల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో శ్రీరాజ్యలక్ష్మిచెంచులక్ష్మి సమేత శ్రీలక్ష్మీనరసింహస్వామి నిత్యకల్యాణాన్ని అర్చకులు శనివారం విశేషంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేకార్చనలు, నిత్యహోమం, మూలవిరాట్ మూర్తికి పంచామృతాభిషేకం, ఎదుర్కోళ్ల మహోత్సవం చేపట్టారు. అదేవిధంగా విష్వక్సేనారాధన, పుణ్యాహవచనం, రక్షాబంధనం, రుత్విగ్వరణం, పంచగవ్యప్రాశన, మధుపర్కపూజ, మాంగల్యధారణ గావించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో ఈలయ అనువంశిక ధర్మకర్తలు చెన్నూరు మట్టపల్లిరావు, విజయ్‌కుమార్, ఈఓ నవీన్, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.

హిట్లర్‌కు తాత.. కేసీఆర్

- తెలంగాణలో నియంత పాలన పోవాలని ఉత్తర తెలంగాణ ప్రజలు కూడా కోరుకుంటున్నారు
- కాంగ్రెస్ మేనిఫెస్టోతో బీఆర్ఎస్ మైండ్ బ్లాక్ అయింది
- ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి



నల్లగొండ పట్టణంలో స్కూటీపై పర్యటిస్తూ ఓటర్లను పలకరిస్తున్న కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

నల్లగొండ: దొరల తెలంగాణ పోయి ప్రజా తెలంగాణ రావాలని ప్రజలు కోరుకుంటున్నారని భువనగిరి ఎంపీ, నల్లగొండ అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ అభ్యర్థి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. ఉత్తర తెలంగాణలో ఇటీవల రాహుల్, ప్రియాంక గాంధీ నిర్వహించిన సభలకు తాను వెళ్లానని, అక్కడి ప్రజలు కూడా నియంత పాలనకు చరమగీతం పాడాల్సిన అవసరం ఉందని అంటున్నారని ఆయన చెప్పారు. శనివారం ఆయన నల్లగొండలో ఎన్నికల ప్రచారం నిర్వహించిన కోమటిరెడ్డి.. ఆ తర్వాత విలేకరులతో మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ ఎమర్జెన్సీ విధించి నష్టం చేసిందని కేసీఆర్ ఆరోపణలు చేస్తున్నారని, ఆనాడు కుటుంబ సమేతంగా వెళ్లి ఢిల్లీకి వెళ్లి సోనియాగాంధీ కాళ్లు మొక్కినప్పుడు ఎమర్జెన్సీ గుర్తుకు రాలేదా అని ప్రశ్నించారు. కేసీఆర్ హిట్లర్‌కు తాత అని అన్నారు. కారు కావాలా..బేకారు కావాలా అంటూ కేసీఆర్ అహంకార పూరితంగా బహిరంగ సభలో మాట్లాడటాన్ని కోమటిరెడ్డి తీవ్రంగా ఖండించారు. కేసీఆర్, కేటీఆర్, హరీష్‌రావు తప్ప మంత్రులు ఎక్కడా ప్రచారం చేస్తున్నట్లు కానరావడం లేదన్నారు. తెలంగాణ కోసం మంత్రి పదవి వదులుకున్నానని, 11 రోజుల పాటు ఆమరణ నిరాహార దీక్ష చేశానని ఆయన చెప్పారు. కేసీఆర్ నల్లగొండను దత్తత తీసుకుంటున్నానని చెప్పినా.. ప్రధాన రోడ్డు తప్ప కాలనీలు పట్టించుకోవడం లేదన్నారు. మైనార్టీలకు ఇళ్లు కట్టించలేదని, డబుల్‌బెడ్ రూమ్ ఇళ్ల ఊసే లేదని విమర్శించారు. కాంగ్రెస్ అధికారంలోకి రాకుండా బీజేపీ, బీఆర్ఎస్, ఎంఐఎం అడ్డుకుంటున్నాయని ఆయన ఆరోపించారు. అక్టోబరు 30న రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలు నల్లగొండలో జరిగే బహిరంగ సభకు హాజరయ్యే అవకాశం ఉందన్నారు. కాంగ్రెస్ మేనిఫెస్టోతో బీఆర్ఎస్ మైండ్ బ్లాక్ అయిందని ఆయన అన్నారు. వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ నల్లగొండ పట్టణ అధ్యక్షుడు గుమ్మలమోహన్‌రెడ్డి, మున్సిపల్ కాంగ్రెస్ ఫ్లోర్ లీడర్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్, కౌన్సిలర్లు ఉన్నారు.

నకిరేకల్‌లో బీఆర్ఎస్‌దే విజయం

- ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్



కండువాలు కప్పి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న చిరుమర్తి లింగయ్య, బడుగుల లింగయ్యయాదవ్

నకిరేకల్: నకిరేకల్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ ఘన విజయం సాధిస్తుందని, మరోసారి చిరుమర్తి లింగయ్య ఎమ్మెల్యే కాబోతున్నారని ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్ అన్నారు. నకిరేకల్ మండలం చందంపల్లి గ్రామానికి వివిధ పార్టీల నాయకులు 50మంది శనివారం బడుగుల లింగయ్య, బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి చిరుమర్తి లింగయ్య సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తెలంగాణలో మూడోసారి బీఆర్ఎస్ అధికారంలోకి రాబోతుందన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల, పట్టణ అధ్యక్షులు ప్రగడపు నవీన్‌రావు, యల్లపురెడ్డి సైదిరెడ్డి, నోముల కేశవరాజు పాల్గొన్నారు.

పొలం గెట్టు విషయంలో గొడవ

- ఇద్దరికి గాయాలు

మేళ్లచెరువు: పొలం గెట్టు విషయంలో ఇరువర్గాల మధ్య జరిగిన గొడవలో ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ ఘటన శనివారం సాయంత్రం మేళ్లచెరువు మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ సురేష్‌యాదవ్ తెలిపిన వివరాల ప్రకారం.. మేళ్లచెరువు మండల కేంద్రానికి చెందిన బచ్చు కొండారెడ్డి తన పొలం వద్ద జేసీబీతో పనిచేయిస్తుండగా పక్క పొలం వ్యక్తి పడిగపాటి కొండారెడ్డి జేసీబీ తన పొలంలోకి వస్తుందని గొడవకు దిగాడు. జేసీబీ ఆపరేటర్ వారిద్దరిని సముదాయించి అక్కడ నుంచి పంపించాడు. కాగా బచ్చు కొండారెడ్డి ఇంటికి వెళ్తూ గ్రామంలోని ఆంజనేయస్వామి ఆలయం వద్ద వాళ్ల నాన్న బచ్చు వెంకటరెడ్డితో మాట్లాడుతుండగా.. అంతలోనే పడిగపాటి కొండారెడ్డి, అతడి కొడుకు వెంకటేశ్వరరెడ్డి, పడిగపాటి రాజమోహన్‌రెడ్డి ముగ్గురు కలిసి అక్కడకు వచ్చి తండ్రీకొడుకులపై కర్రలతో దాడి చేశారు. బచ్చు వెంకటరెడ్డి కుమార్తె వీరకుమారి ఫిర్యాదు మేరకు పడిగపాటి కొండారెడ్డి, అతడి కుమారుడు వెంకటేశ్వరరెడ్డి, రాజమోహన్‌రెడ్డిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం ఖమ్మంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించినట్లు పేర్కొన్నారు. గత 15 సంవత్సరాల నుంచి వారిద్దరి మధ్య పొలం గెట్టు విషయంలో గొడవలు జరుగుతున్నట్లు గ్రామస్తులు తెలిపారు.

లిఫ్ట్ మరమ్మతులు చేయించాలని ధర్నా



ఆందోళన చేస్తున్న కాంగ్రెస్ నాయకులు, రైతులు

హుజూర్‌నగర్ (చింతలపాలెం): చింతలపాలెం మండలంలోని శివగంగ ఎత్తిపోతల పథకం(లిఫ్ట్)కు మరమ్మతులు చేయించి పంట పొలాలకు నీరు అందించాలని కాంగ్రెస్ నాయకులు, రైతులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం చింతలపాలెంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పాత వెల్లటూరు వద్ద నిర్మించిన శివగంగ ఎత్తిపోతల పథకం పైపులు పగిలి నీరు రావడం లేదని దీంతో చేతికొచ్చిన పత్తి, మిరప పంటలకు సాగు నీరు లేక ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు వెంటనే స్పందించి ఎత్తిపోతల పథకానికి మరమ్మతులు చేయించి ఎండిపోతున్న పంటపొలాలకు నీటిని అందించి రైతులను ఆదుకోవాలని కోరారు. ధర్నా వద్ద ఎస్‌ఐ సైదిరెడ్డి మాట్లాడుతూ.. ట్రాఫిక్ ఇబ్బంది లేకుండా శాంతియుతంగా నిరసన తెలపాలని నిరసనకారులకు సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ఎస్. కొండారెడ్డి, ఇంద్రారెడ్డి, ఎల్. సైదులు, నరేందర్‌రెడ్డి, జానిమియా, హనీమిరెడ్డి, యోగానందరెడ్డి, మౌలాలి, సైదిరెడ్డి, దాదాబుడే, సురేందర్, రాజశేఖర్‌రెడ్డి, లింగారెడ్డి, శంకరాచారి, వెంకటరెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, సైదులు, నాగుల్‌మీరా, లాకు, హుస్సేన్, సామ్య, వెంకయ్య, ఎర్రెడ్డి, సంతోష్, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

అలరించిన మోహిని భస్మాసుర నాటిక



మోహిని భస్మాసుర నాటికను ప్రదర్శిస్తున్న కళాకారులు

హుజూర్‌నగర్: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా హుజూర్‌నగర్ పట్టణంలోని 17వ వార్డులో రంగస్థల కళాకారుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం రాత్రి ప్రదర్శించిన మోహిని భస్మాసుర నృత్య నాటిక ఆకట్టుకుంది. సీనియర్ కళాకారుడు దొంతగాని సత్యనారాయణ రచన, దర్శకత్వంలో నటులు ఆహాభావాలు, జానపద నృత్యాలు అద్భుతంగా ప్రదర్శించి ప్రేక్షకులను అలరించారు. భస్మాసురుడిగా దొంతగాని సత్యనారాయణ శివుడిగా భద్రాచలం, మోహినిగా బి.అఖిల విష్ణువుగా దాసరి సుకన్య నారదుడిగా ములకలపల్లి శ్రీను ప్రధాన పాత్రలు పోషించారు. ఉండేటి నవ్య, వేముల శ్రీహరి, చరవాది చరణ్, నరసింహనాయుడు, సాయి హేమంత్, గొట్టిముక్కల రాములు, బండి చెన్నకేశవులు కూడా నటించి నృత్యాలు చేశారు. అనంతరం కమిటీ సభ్యులు కళాకారులను అభినందించి సన్మానించారు.

• బీఆర్ఎస్‌కు మూకుమ్మడి రాజీనామా



బీఆర్ఎస్‌ను వీడి రాజీనామా పత్రాన్ని చూపుతున్న కోదాడ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే వేనేపల్లి చందర్‌రావు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు

ఆలయంలో చోరీ

చిలుకూరు: మండల పరిధిలోని సీతారామచంద్రస్వామి దేవాలయంలో చోరీ జరిగింది. రోజుమాదిరిగా శనివారం తెల్లవారుజామున కూడా దేవాలయం తెరిచేందుకు వెళ్లగా.. అందులోని గది తలుపులు తెరిచి ఉండడంతో చోరీ జరిగినట్లు ఆలయ పూజారులు గుర్తించారు. ఈ విషయాన్ని ఆలయ ఈఓ మృత్యుంజయశాస్త్రి, ఆలయ చైర్మన్, కమిటీ సభ్యులకు తెలియజేశారు. గది తాళాలు పగులగొట్టకుండా గొళ్లెంను కట్ చేసి స్వామివారి పురాతన వాహనాలైన ఇత్తడితో తయారుచేసిన శేష వాహనం, గరుత్మంతుడి వాహనం, హనుమంత వాహనం చోరీ చేసినట్లు ఈఓ తెలిపారు. మొత్తంగా 70 కేజీల ఇత్తడి దొంగతనానికి గురైందని, దీనిపై చిలుకూరు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లుగా పేర్కొన్నారు.

తప్పిపోయిన బాలుడు.. కుటుంబ సభ్యుల చెంతకు



బాలుడిని ఆలయ ముఖ మండపంలో తమ వద్ద కూర్చోబెట్టుకున్న ఎస్పీఎఫ్ సిబ్బంది

యాదగిరిగుట్ట: యాదాద్రి లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకునేందుకు వచ్చిన ఓ బాలుడు ఆలయ పరిసరాల్లో తప్పిపోగా.. ఎస్పీఎఫ్ సిబ్బంది గుర్తించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. వివరాలు.. శనివారం ఉదయం ధర్మదర్శనం, వీఐపీ దర్శనాల కోసం భక్తులను బంగారు వాకిలి వద్దకు అధికారులు అనుమతించారు. ఆ సమయంలో హైదరాబాద్‌కు చెందిన ఓ కుటుంబం దర్శనం చేసుకునే హడావుడిలో తమతో వచ్చిన సుమారు నాలుగేళ్ల వయస్సు ఉన్న బాలుడిని మరిచిపోయారు. ముఖ మండపంలోని హుండీ వద్ద బాలుడు ఏడుస్తూ కనిపించడంతో ఎస్పీఎఫ్ సిబ్బంది గుర్తించారు. వెంటనే బాలుడిని తమ వద్ద కూర్చోబెట్టుకొని, ఆలయాధికారులతో మైక్‌లో అనౌన్స్‌మెంట్ చేయడంతో కుటుంబ సభ్యులు వచ్చి బాలుడిని తీసుకెళ్లారు. ఎస్పీఎఫ్ సిబ్బందికి బాలుడి కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

పోలీసు అమరులకు నివాళి

ఆత్మకూరు(ఎం): మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ ఆవరణలో పోలీసు అమరుల దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన ఎస్‌ఐ డి. సిద్దయ్య, ఎండీ చాంద్‌పాష, ఏఎస్‌ఐ సుల్తాన్ మోహినోద్దీన్, కానిస్టేబుల్ సీహెచ్. నాగరాజు, హోంగార్డు లింగయ్య చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ నాగరాజు, సిబ్బంది రామచంద్రయ్య, అంజయ్య, శ్రీను, నరేందర్, సైద, విజయ్, ప్రేమలత, గాయత్రి, పద్మ, ప్రియాంక పాల్గొన్నారు.

'బెల్టు' దుకాణ నిర్వాహకుల బైండోవర్

ఆత్మకూరు(ఎం) : ఎన్నికల నిబంధనలు ఉల్లంఘించి మండలంలో బెల్టు దుకాణాలు నిర్వహిస్తున్న పలువురిని మండల తహసీల్దార్ కార్యాలయంలో శనివారం పోలీసులు బైండోవర్ చేశారు. బైండోవర్ చేసిన వారిలో పుల్లాయిగూడెం, రాఘవాపురం, పల్లెర్ల, కూరెల్ల గ్రామాలకు చెందిన 10మంది వరకు ఉన్నట్లు మోత్కూరు ఎక్సైజ్ కానిస్టేబుల్ ఎం.కృష్ణ తెలిపారు.

కుట్రలను తిప్పికొట్టిన చరిత్ర తెలంగాణది



సూర్యాపేట జిల్లా చరిత్ర, సంస్కృతి పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి జగదీష్‌రెడ్డి తదితరులు

- రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి జగదీష్‌రెడ్డి

భానుపురి (సూర్యాపేట): తెలంగాణ చరిత్ర, సంస్కృతిని మరిచిపోయేలా చేసిన గత పాలకుల కుట్రలను తెలంగాణ సమాజం తిప్పి కొట్టిందని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీష్ రెడ్డి అన్నారు. ప్రముఖ రచయిత, సూర్యాపేట గ్రంథాలయ సంస్థ మాజీ అధ్యక్షుడు యానాల యాదగిరిరెడ్డి రచించిన 'సూర్యాపేట జిల్లా చరిత్ర, సంస్కృతి' పుస్తకాన్ని శనివారం సుధా బ్యాంక్ ఆడిటోరియంలో మంత్రి ముఖ్య అతిథిగా హాజరై ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అస్తిత్వం, ఆత్మగౌరవం కోసం జీవితాలు త్యాగం చేసిన గొప్ప చరిత్ర తెలంగాణ సమాజానిదని పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం సాహిత్యానికి పెద్ద పీట వేసిందని తెలిపారు. వేల సంవత్సరాల చరిత్రను పరిశీలిస్తే వ్యవసాయం ఉన్నచోటే నాగరికత అభివృద్ధి చెందిందని, కాకతీయుల పాలన కంటే ముందుగానే నాగరిక సమాజం అద్వితీయంగా ఉందని పేర్కొన్నారు. మానవీయ విలువలతో కూడిన మంచి సమాజం తయారు చేసిన మహానుభావులను మరువరాదని తెలిపారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా చైతన్యవంతమైన ప్రాంతమని, ముఖ్యంగా సూర్యాపేట అనేక ఉద్యమాలకు పోరుగడ్డగా నిలిచిందన్నారు. సాహిత్య అభివృద్ధికి, చైతన్యానికి పురిటిగడ్డగా పునాదులు వేసిందన్నారు. సూర్యాపేట ప్రాంతానికి ఉన్న గొప్ప చరిత్రపై రచయిత యానాల యాదగిరిరెడ్డి పుస్తకాలు రచించడం అభినందనీయమని కొనియాడారు. జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షుడు నిమ్మల శ్రీనివాస్ గౌడ్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో సుధా బ్యాంకు చైర్మన్, సుధాకర్ పీవీసీ ఎండీ మీలా మహదేవ్, సుధా బ్యాంక్ ఎండీ పెద్దిరెడ్డి గణేష్, బంటు కృష్ణ, పోరెడ్డి మధుసూదన్‌రెడ్డి, పానుగోటి నిర్మల, బోనగిరి భాస్కర్, మల్లారెడ్డి, శీల అవిలేను, వెంకటేశ్వర్లు, పోతుగంటి వీరాచారి, శ్రీనివాస చారి, ఆనంద్, పల్లె మణి బాబు, ధైద వెంకన్న పాల్గొన్నారు.

పోలీస్ అమరుల త్యాగం మరువలేనిది



నివాళులర్పిస్తున్న పోలీసు అమరుల కుటుంబ సభ్యులు

- నల్లగొండ కలెక్టర్ కర్ణన్, ఎస్పీ అపూర్వరావు



పోలీసు అమరుడి కుటుంబ సభ్యులను సన్మానిస్తున్న కలెక్టర్ కర్ణన్, ఎస్పీ అపూర్వరావు

నల్లగొండ క్రైం: సమాజంలో శాంతిభద్రల పరిరక్షణలో పోలీస్ అమరవీరుల త్యాగం మరువలేనిదని నల్లగొండ కలెక్టర్ ఆర్‌వీ. కర్ణన్, ఎస్పీ అపూర్వరావు అన్నారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం నల్లగొండ జిల్లా పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన స్మృతి పరేడ్ కార్యక్రమానికి వారు హాజరయ్యారు. ఈ సందర్భంగా అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పించి మాట్లాడారు. దేశ వ్యాప్తంగా సంఘ విద్రోహులతో పోరాడి 183 మంది పోలీసులు అమరులైతే అందులో జిల్లా నుంచి 15 మంది ఉన్నారని గుర్తు చేశారు. అమరుల కుటుంబాలకు పోలీస్ శాఖ, ప్రజలు అండగా ఉంటారని తెలిపారు. ఈనెల 31 వరకు అన్ని జిల్లాలోని అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో ఓపెన్ హౌజ్, రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేయాలని, షార్ట్‌ఫిల్మ్, ఫొటోగ్రఫీ, విద్యార్థులకు వ్యాసరచన పోటీలు, సైకిల్ ర్యాలీలు నిర్వహిస్తామన్నారు. అంతకు ముందు అమర వీరుల కుటుంబాలతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకుని వారిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో బెటాలియన్ కమాండెంట్ సత్యశ్రీనివాసరావు, అడిషనల్ ఎస్పీ హనుమంతరావు, జైల్ సూపరింటెండెంట్ దేవ్‌లానాయక్, డీఎస్పీలు సోమ్‌నారాయన్ సింగ్, శ్రీధర్‌రెడ్డి, సైదానాయక్, లక్ష్మీనారాయణ, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఆమడ దూరంలో అపర సంజీవని

- మునుగోడు పీహెచ్‌సీ నుంచి 108 వాహనం తరలింపు
- ఆపద సమయాల్లో ఇబ్బందులు పడుతున్న బాధితులు
- స్థానిక పీహెచ్‌సీ నుంచే సేవలు అందించేలా చూడాలని వినతి



జమస్థాన్‌పల్లి క్రాస్ రోడ్డు వద్ద చెట్టుకింద ఉంచిన 108 వాహనం

మునుగోడు : ఆపద సమయాల్లో సేవలు అందించేందుకు రెండేళ్ల క్రితం మునుగోడులో గిఫ్ట్ ఏ స్మైల్ ద్వారా ఓ 108 అంబులెన్స్ వాహనాన్ని ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి మునుగోడు పీహెచ్‌సీ నుంచి ఆ వాహనం ద్వారా మండల ప్రజలకు సేవలు అందిస్తున్నారు. ఏమైందో ఏమో గానీ ప్రస్తుతం ఆ వాహనాన్ని మూడు కిలో మీటర్ల దూరంలోని జమస్థాన్‌పల్లి క్రాస్ రోడ్డు వద్ద ఉంచేలా సంబంధిత అధికారులు సిబ్బందికి సూచనలు చేశారు. దీంతో ఆపదలో ఉన్న వారికి సకాలంలో సేవలందడం లేవని ప్రజలు పేర్కొంటున్నారు. క్రాస్ రోడ్డు నుంచి మండల కేంద్రానికి వాహనం వచ్చేందుకు కనీసం 20 నిమిషాలకు పైగా సమయం పడుతుండటంతో అత్యవసర సమయాల్లో ఇబ్బందులు తప్పడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దీంతో పాటు అక్కడ 108 వాహన సిబ్బంది మౌలిక వసతులు కూడా లేక పోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. మండల ప్రజలకు 108 వాహనం ఉపయోగపడుతుందని తమ నాయకుడు సొంత డబ్బులతో కొనుగోలు చేసి ఉచితంగా అందిస్తే దానిని మరొక చోట ఉంచడం సరైంది కాదని ఆ వాహనం అందించిన వేమిరెడ్డి నర్సింహారెడ్డి అనుచరులు మండిపడుతున్నారు. సంబంధిత అధికారులు చొరవ తీసుకొని వాహనాన్ని స్థానిక పీహెచ్‌సీలో ఉంచాలని ప్రజలు కోరుతున్నారు.

అభ్యర్థుల ఎన్నికల ఖర్చు నమోదు చేయాలి

- నల్లగొండ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ కర్ణన్



పాల్గొన్న అధికారులు

నల్లగొండ: నామినేషన్ల ప్రక్రియ నుంచి ఎన్నికల ప్రక్రియ ముగిసే వరకు పోటీలో ఉండే అభ్యర్థుల ఖర్చుల వివరాలను ఎన్నికల వ్యయ పరిశీలన బృందాలు కచ్చితంగా నమోదు చేయాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్ ఆదేశించారు. శనివారం జిల్లా కలెక్టరేట్‌లో సహాయ వ్యయ పర్యవేక్షకులు, అకౌంటింగ్, ఎస్ఎస్‌టీ, వీవీటీ సభ్యులకు నిర్వహించిన ఎన్నికల విధుల శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల వ్యయం లెక్కింపునకు, ఎన్నికల నిర్వహణకు ఫ్లయింగ్ స్క్వాడ్, స్టాటిక్ సర్వేయలెన్స్ టీమ్, వీడియో సర్వేయలెన్స్ టీమ్, వీడియో పరిశీలన టీమ్, అకౌంటింగ్ టీమ్‌లను నియమించామన్నారు. టీమ్‌ల అధికారులంతా సమన్వయంతో పనిచేయాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు హేమంత్‌కేశవ్‌పాటిల్, జె.శ్రీనివాస్, జిల్లా వ్యయ పర్యవేక్షణ కమిటీ నోడల్ అధికారి ఆర్.కిరణ్‌కుమార్, జెడ్పీ సీఈఓ ప్రేమ్‌కరణ్‌రెడ్డి, మాస్టర్ ట్రైనర్ తరాల పరమేష్ పాల్గొన్నారు.

ఆధారాలు చూపితే 24 గంటల్లో రిలీజ్ ..

నిబంధనలకు విరుద్ధంగా రూ.50వేలకు మించి తరలిస్తూ సీజ్ కాబడిన నగదు, వస్తువులను తగిన ఆధారాలు చూపితే 24 గంటల్లో రిలీజ్ చేస్తామని కలెక్టర్ ఆర్‌వీ.కర్ణన్ అన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 177 కేసుల్లో 150 కేసులకు సంబంధించి 4,85,5,100 రూపాయల నగదు, వస్తువులను రిలీజ్ చేశామన్నారు. ఆధారాలు లేకుండా తీసుకెళ్లిన డబ్బులను రిలీజ్ చేసేందుకు జిల్లా స్థాయిలో గ్రీవెన్స్ కమిటీని ఏర్పాటు చేశామన్నారు. డబ్బులు సీజ్ అయితే గ్రీవెన్స్ కమిటీని సంప్రదించాలని కోరారు. గ్రీవెన్స్ కమిటీ చైర్మన్ (జెడ్పీ సీఈఓ ప్రేమ్‌కరణ్‌రెడ్డి) 9849903266, కన్వీనర్ (సహకార అధికారి కిరణ్‌కుమార్ 9100115650, కన్వీనర్ (ట్రెజరీ అధికారి రవికుమార్) సెల్ : 7799934289 నంబర్లను సంప్రదించాలని కోరారు.